పుర వీధుల్లో కంపు.. కంపు

పేరుకు గ్రేడ్1 మున్సిపాలిటీ.. అంతకు మించి జిల్లా కేంద్రం.. అన్నింటికీ మించి మూడు ప్రధాన శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సొంత నియోజకవర్గం.. ఇవన్నీ చెప్పుకోవడానికి బాగున్నా.. ఇక్కడ పాలన మాత్రం పడకేసింది. పురపాలక పరిధిలోని కాల్వల్లో చెత్తా చెదారం, వ్యర్థాలు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు రహదారిపై చేరడం.. దుమ్ము ధూళి.. చీమల పుట్టలను తలపించేలా దోమలు పెరగడంతో జనం అనారోగ్యం పాలవుతున్నారు.

- రాయచోటి మున్సిపాల్టీలో పడకేసిన పాలన
- దోమల విజృంభణతో ప్రబలుతున్న రోగాలు
- మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నా.. స్పందన కరవు

జిల్లా	మున్సిపాలిటీ	మొత్తం జనాభా	మొత్తం వార్డులు	పారిశుద్ధ్య సిబ్బంది
అన్నమయ్య	రాయచోటి	1,40,000	34	237

చెత్త సేకరణ వాహనాలు	24 ఆటోలు	7 ట్రాక్టర్లు	3 లారీలు

శివారు కాలనీలు : ఏజీ గార్డెన్, రాయుడు కాలనీ, శిబకతుల్లా కాలనీ, మిట్టవాండ్లపల్లి, ఎస్టీ కాలనీ, తిరుపతి నాయుడు కాలనీ, పాత రాయచోటి, పాత రాయచోటి హరిజనవాడ, పిటిఎం పల్లి, కొత్తపల్లి, తూదేకులపల్లి, కొత్తపేట రామాపురం, ఆదిరెడ్డి మిషన్, గుణికుంట్ల రోడ్డు, బిరాన్ సాబ్ వీధి, బాలాజీ నగర్ తదితర ప్రాంతాలు.


రాయచోటి పట్టణ రాణా సమీపంలో జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు


మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి ప్రాంతంలో కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రం.. రాయచోటి పట్టణం దుర్గంధ భరితమై ముక్కుపుటలు అదిరిపోయే కంపు.. కొడుతోంది. ప్రధాన రహదారులపై వెళ్తే చాలు.. కళ్ల నిండా.. తల చుట్టూ దుమ్ము నిండుతోంది. రాయచోటి పురపాలక అధికారులు, పారిశుద్ధ్య కార్మికుల మధ్య సమన్వయం లోపించింది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుంచి పాలక వర్గాన్ని పక్కనపెట్టి అధికార పార్టీ నాయకులు.. వార్డులలో తమ అనుయాయులతో కలిసి అధికారులపై పెత్తనం చెలాయించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పాలనపై దృష్టి పెట్టకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు తోసిందే చెత్త, చేసిందే పనిలా ఉంది. ఫలితంగా మురుగు కాల్వల్లో నీరు రహదారిపై చేరుతోంది. దీనికి తోడు చెత్తా చెదారం చేరి కుళ్లి దుర్వాసన వస్తోంది. పర్యవేక్షించాల్సిన శానిటరీ ఇన్స్‌పెక్టర్‌ను అధికారులు పట్టించుకోకపోవడంతో సచివాలయం శానిటరీ సెక్రటరీ పర్యవేక్షణ అస్తవ్యస్తంగా మారింది.

వాహనాల వినియోగంపై నిర్లక్ష్యం

స్వచ్ఛ భారత్ కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వ నిధులతో చెత్త సేకరణ వాహనాలు కొనుగోలు చేశారు. నిత్యం చెత్త సేకరణకు 183 మంది పారిశుద్ధ్య కార్మికులు, 54 మంది రోజువారీ వేతనం తీసుకునే సిబ్బంది ఉన్నారు. అధికారులు, కార్మికుల మధ్య సమన్వయం, పర్యవేక్షణ కొరవడి అనుకున్న స్థాయిలో చెత్త సేకరణ జరగలేదు. శివారు ప్రాంతాలను స్వచ్ఛత వీధులుగా మార్చేందుకు ఎన్నో చైతన్య కార్యక్రమాలు చేసినా అనుకున్న ఫలితం రావడంలేదు. తడి, పొడి చెత్త సేకరణ కార్యక్రమం అంతంత మాత్రంగానే నడుస్తోంది.

విజృంభిస్తున్న దోమలు

పారిశుద్ధ్య నిర్వహణ అటకెక్కడంతో మురుగు కుంటల్లో దోమల ఉత్పత్తి చీమల పుట్టల్లా పెరుగుతోంది. బేతాళ కాలనీ పరిధిలోని బలరామరాజు వీధిలో తాగునీరు యథేచ్ఛగా వృథాపోతోంది. వీధి నిండా చేరి చిన్నపాటి కుంటను తలపిస్తోంది. కొత్తపల్లి, బోస్ నగర్, బిరాన్‌సాబ్ వీధి, కొత్తపేట, కె.రామాపురం ప్రాంతాల్లో ఏ వీధిలో చూసినా కాల్వల్లో చెత్త పేరుకుపోయింది. రోడ్లపై మురుగునీరు కనిపిస్తోంది. జాతీయ రహదారిపై కూడా మురుగు చేరడం పారిశుద్ధ్య కార్మికుల పనితీరుకు అద్దం పడుతోంది. పందులు స్వైరవిహారం చేయడంతో జనం జ్వరాల బారిన పడుతున్నారు.

మంత్రి జోక్యం చేసుకోవాలి

జిల్లా కేంద్రమైన రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య పరిస్థితులు గాడిన పడాలంటే మంత్రి చొరవ చూపి ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిందేనని పట్టణ వాసులు కోరుతున్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి పట్టణంపై పూర్తి అవగాహన ఉండడంతో ప్రత్యేక దృష్టి సారించి పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికల రచించాలని చెబుతున్నారు.

పారిశుద్ధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం

మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. కార్మికులతో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ చెత్త తొలగింపునకు చర్యలు చేపట్టాం. ఈ మధ్యకాలంలో చెత్త సేకరణలో నెలకొన్న పరిస్థితులను అవగతం చేసుకొని ముందుకు పోతున్నాం. దోమల నివారణకు చర్యలు చేపడుతున్నాం.

– వాసుబాబు, రాయచోటి మున్సిపల్ కమిషనర్

పాలకవర్గం మాట చెల్లడంలేదు



రాయచోటి మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఎంతో ఉంది. కానీ పాలకవర్గం మాట చెల్లడం లేదు. అధికార పార్టీ నాయకుల జోక్యం, మాటల కారణంగా పట్టణంలో జరగాల్సిన అభివృద్ధి ఆగిపోయింది. ఎక్కడ చూసినా మురుగు చేరి పారిశుద్ధ్య చర్యలు లోపించాయి.

– ఎస్.ఫయాజ్‌బాషా, మున్సిపల్ చైర్మన్, రాయచోటి

క్లుప్తంగా

శ్రీనివాసుడికి పూజలు

సుండుపల్లె : మండలంలోని ఆరోగ్యపురంలో వెలసిన శ్రీనివాసుడికి శనివారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు పూజల్లో పాల్గొని స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా నాగ ప్రతిష్ట

నందలూరు : మండల కేంద్రంలోని కన్యకాచెరువు అలుగు సమీపంలో వెలసిన ముత్తుమారెమ్మ ఆలయ ఆవరణంలో శనివారం నాగ విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన బెస్త దేవిక, ఆమె కుమార్తె దీప్తి, కుమారుడు కష్ణ నాగ విగ్రహాలను అందజేశారు. పండితులు నాగరాజస్వామి ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కోడి జయశ్రీ, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి ఆభరణాల బహూకరణ

గాలివీడు : మండలకేంద్రంలోని పెద్దూరు వేంకటేశ్వరస్వామికి దాతలు గీదర ధర్మారెడ్డి కుటుంబసభ్యులు, అమరావతి ఉదయ్‌కుమార్ కుటుంబ సభ్యులు పంచలోహ ఆభరణాలను వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో స్వామికి సమర్పించిన మకర తోరణం, కిరీటం, శంకు చక్రాలు, కర్ణాభరణాలు, హస్తాలు, పాదాలు, స్వామికి శాస్త్రోక్తంగా అలంకరించారు. దేవాదాయశాఖ ఈఓ కొండారెడ్డి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

వసతి గృహం తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని బాలురు, బాలికల వసతి గృహాలను రాయచోటి జిల్లా ఐదో అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సౌకర్యాలపై విద్యార్థులను అడిగి ఆరా తీశారు. వంట గదులు, మరుగు దొడ్లు, ఆవరణంలోని ప్రదేశాలను పరిశీలించి విద్యార్థులకు సూచనలు, చేశారు. వసతి గృహాలలో సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయం..

నందలూరు : రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి స్థానిక తహశీల్దారు కార్యాలయాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాగిరెడ్డిపల్లి సచివాలయం–3లో ఓ ల్యాండ్ కన్వర్షన్‌కు వచ్చిన భూమిని సబ్ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించండి

సిద్దవటం : మండలంలోని రామక్రిష్ణాపురం గ్రామంలో కొన్ని రోజులుగా తాగు నీరు రావడంలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీ బిందెలు చేతబట్టి నిరసన తెలిపారు. తరచూ నీటి సమస్య ఉన్నా పరిష్కరించడం లేదని మహిళలు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసయ్యను వివరణ కోరగా సిద్దవటం పెన్నానది వద్ద మాధవరం–1కు వచ్చే పైపలైన్‌లో సమస్య ఉందని, త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

గుడ్డు వివాదంపై విచారణ

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గుడ్డు వివాదంపై ఐసీడీఎస్ ఏసీడీపీఓ శోభారాణి శనివారం విచారించారు. విలేకరులతో ఆమె మాట్లాడుతూ పిల్లలకు ఇచ్చే గుడ్డులో నాణ్యత లేదని కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. వారి ఆదేశాల మేరకు విచారణకు వచ్చినట్లు ఆమె తెలిపారు. గుడ్లలో నాణ్యతా లోపాలున్నాయని గుర్తించి అంగన్‌వాడీ కార్యకర్త సుబ్బలక్ష్మిని విచారించామని తెలిపారు. కాంట్రాక్టర్ నాణత్య లేని గుడ్లు తీసుకుని వేరే గుడ్లు ఇస్తామని చెప్పారన్నారు. పై అధికారులకు నివేదిక అందజేస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవిద్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన

గాలివీడు : బాల్య వివాహాలను అరికట్టడానికి బాధ్యతగా పనిచేయాలని లక్కిరెడ్డిపల్లి ఫస్ట్ క్లాస్ కోర్టు జడ్జి షేక్ ఫైజున్నీసా పేర్కొన్నారు. విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక వెలుగు కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, బాలికలపై లైంగిక వేధింపులు, చిన్నారుల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను గుర్తిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. సిద్దయ్య, కృష్ణయ్య, పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

రాజంపేట : పట్టణంలోని అన్నమాచార్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో శనివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ జయరామిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి మూల స్తంభాలన్నారు. అనంతరం వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇన్ సర్వీస్ టీచర్స్‌కు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. వనజాక్షమ్మ, డా.రవీంద్రనాథ్, ఉత్తమయ్య, శ్రీధర్, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


ఎంపీడీవో వెంకటేష్‌ను కలిసిన ఉద్యోగులు

రాయచోటి అర్బన్ : రాయచోటి ఎంపీడీవోగా వెంకటేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పులివెందులలో పనిచేస్తున్న ఆయన రాయచోటికి బదిలీ కాగా.. ఇక్కడ పనిచేస్తున్న మల్‌రెడ్డి ఓబులవారిపల్లెకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవోకు కార్యాలయ సిబ్బంది, తదితరులు పుష్ప గుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు.


రెడ్డెయ్య

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి ఎంపీడీఓగా జి.రెడ్డయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. రెడ్డయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఆరా తీసి తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు.

గాలివీడు ఎంపీడీఓగా జవహర్‌బాబు


జవహర్‌బాబు

గాలివీడు : గాలివీడు ఎంపీడీఓగా జవహర్ బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో వుంటూ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.


బాధ్యతలు స్వీకరించిన మల్‌రెడ్డి

ఓబులవారిపల్లె : ఓబుళవారిపల్లె ఎంపీడీఓగా మల్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాయచోటి నుంచి బదిలీపై ఆయన ఓబుళవారిపల్లికి రాగా, ఇక్కడ పనిచేస్తున్న విజయారావు పెనగలూరుకు బదిలీపై వెళ్లారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీఓపై ఎంపీపీ ఆగ్రహం


ఎంపీడీఓతో మాట్లాడుతున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి

నందలూరు : నందలూరు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ ప్రకాష్‌పై ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ ఛాంబర్‌లోకి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంటూ వచ్చిన మేడా విజయశేఖర్‌రెడ్డికి మినిట్స్ బుక్ ఇవ్వడంతో అందులో రాతలను ఆయన చెరిపివేశారు. దీంతో ఇన్‌ఛార్జి ఎంపీడీఓను ఇదేమిటంటూ ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాధానం ఇవ్వకుండా అక్కడి నుంచి ప్రకాష్ బయటకు వెళ్లిపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అంతకు ముందు ఉపాధి హామీ పనులపై జరిగిన సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ సుజాతమ్మ మాట్లాడుతూ కంప్యూటర్ ఆపరేటర్ లేక ఇబ్బందులు పడుతున్నామని ఎంపీపీకి తెలిపారు. కలెక్టర్‌తో ఈ విషయంపై మాట్లాడి ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నాయనపల్లి అనుదీప్, తుమ్మల భావన, కరీముల్లాఖాన్, నడివీధి సుధాకర్, తుమ్మల శ్రీధర్, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, నాగ సుబ్బయ్య, కాకిచంద్ర, మన్సూర్, ఓర్సు శ్రీనివాసులు, సుధాకర్, నందలూరు ఉప సర్పంచ్ ఇబ్బు రులు పాల్గొన్నారు.

రూ.1.82 లక్షల సొమ్ము రికవరీ


ప్రజావేదికలో పాల్గొన్న ఏపీడీ ప్రతాప్, లోకేశ్వరయ్య, సుధాకర్, తదితరులు

రామాపురం : మండలంలోని 13 గ్రామ పంచాయితీల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అక్రమాలను గుర్తించి రూ.1.82 లక్షలు రికవరీ చేసినట్లు ఎస్సార్పీ సుబ్బారావు తెలిపారు. 2023 ఏప్రిల్, 1వ తేదీ నుంచి 2024 మార్చి, 31వ తేదీ వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. అనంతరం ఉపాధి హామీ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఏపీడీ ప్రతాప్, ఎస్‌టీఎం లోకేశ్వరయ్య, విజిలెన్స్ అధికారి సుధాకర్ విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు, పశువుల షెడ్లు, కుంటలు, డక్ అవుట్ గుంతలు, కాల్వల నిర్మాణం వంటి పనులు చేపట్టారు. వీటికి సంబంధించి రూ.15.55 కోట్లు ఖర్చు చేయగా.. అధికారులు సామాజిక తనిఖీ నిర్వహించారు. 13 గ్రామ పంచాయతీల్లో అక్రమాలను గుర్తించి రూ.1.82 లక్షలు రికవరీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జాషువా, డీఆర్పీలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రుజువు లేకపోవడంతో హత్య కేసు కొట్టివేత

రాయచోటి టౌన్ : పోలీసులు హత్య కేసుగా నిర్ధారించినా.. రాయచోటి కోర్టులో రుజువులు చూపలేకపోవడంతో కేసు కొట్టి వేసినట్లు న్యాయవాదులు టి.ఈశ్వర్, ఆనంద్ కుమార్ తెలిపారు.

వివరాలిలా ఉన్నాయి. గాలివీడు మండలం అరవీడు కస్బాకు చెందిన ప్యారంపల్లె వెంకటరమణ తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. తన సహచరులుగా షేక్ షబ్బీర్, షేక్ అల్లాబక్ష్, షేక్ అమ్రుద్దీన్‌లతో స్నేహంగా ఉంటూ అప్పుడప్పుడూ తన ఇంట్లో డిన్నర్ ఇచ్చేవాడు. ఈ సమయంలో వెంకటరమణ భార్యతో అమ్ముద్దీన్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో అతడిని అంతం మొందించాలని భావించి 2018 ఫిబ్రవరి, 18న మిగిలిన ఇద్దరు స్నేహితులతో కలిసి అమ్ముద్దీన్‌ను వెంకటరమణ వెంట తీసుకెళ్లారు. ఓ ప్రాంతంలో మద్యంలో(బీరులో) విష గుళికలు కలిపి తాగించారని, స్పృహ కోల్పోవడంతో అమ్ముద్దీన్‌ను తాడుతో ఉరివేసి చంపేశారని అప్పటి పోలీసులు వెంకటరమణ, మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. విచారణ సాగించిన తరువాత రుజువు చేయడంలో పోలీసులు విఫలమయ్యారని న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి కేసు కొట్టివేసినట్లు వారు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సర్వసాధారణం


గురుప్రసాద్ రెడ్డిని సన్మానిస్తున్న సిబ్బంది

ఒంటిమిట్ట : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమని ఎఫ్ఆర్ఓ ప్రణీతాబాయి పేర్కొన్నారు. ఒంటిమిట్ట అటవీ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న మండలంలోని మంటపంపల్లి ఎఫ్‌బీఓ జె.గురుప్రసాద్ రెడ్డి, అటెండర్ బి.ఓబులేసులుకు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రణీతాబాయి మాట్లాడుతూ సక్రమంగా విధులు నిర్వహించి ఉన్నత పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూములు పంపిణీ చేయండి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఓబులవారిపల్లె : మండలంలోని నిరుపేద దళిత, గిరిజనులకు భూములు పంపిణీ చేయాలని బీకేఎంయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి కోరారు. చిన్నఓరంపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజు రోజుకూ దళితులపై దాడులు జరుగుతున్నాయని, వెంటనే వాటిని నియంత్రించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తోపుకృష్ణ మాట్లాడుతూ దళిత, గిరిజన కుటుంబాకు ఒక్కొక్కరికి మూడు ఎకరాలు చొప్పున భూపంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గా వెంకటరెడ్డి, గోపాల్, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

పెనగలూరు : మండలంలో ప్రజల సమస్యలను మీ దృష్టికి తెచ్చినపుడు వెంటనే పరిష్కరించాలని మండల ఉపాధ్యక్షుడు కొండూరు విజయరెడ్డి కోరారు. మండల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన విజయారావును ఆయన కలిసి పలు విషయాలపై చర్చించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సంబేపల్లె : ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీడీఓ ఎస్.రామచంద్రయ్య అన్నారు. సుండుపల్లె మండల నుంచి బదిలీపై వచ్చిన ఆయన సంబేపల్లె ఎంపీడీవోగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయం సిబ్బంది, తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

రాజంపేటలో 20 మద్యం దుకాణాలు


మాట్లాడుతున్న మల్లిక

రాజంపేట : రాజంపేట పరిధిలో 20 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లిక అన్నారు. విలేకరులతో తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. లాటరీ సమయంలో అభ్యర్థి రాలేకపోతే ఆయన తరపున వ్యక్తి అఫిడవిట్ తీసుకురావాల్సి ఉంటుందన్నారు. బాండ్ పేపర్, దరఖాస్తు చేసుకున్న వ్యక్తి చేత దరఖాస్తు పంపాల్సి ఉంటుందన్నారు. ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. నియమనిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందన్నారు.

వరిలో కాండం తొలుచు పురుగు


వరి పైరులో కాండం తొలుచు పురుగును పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

సిద్దవటం : పెద్దపల్లిలో రైతులు సాగు చేసిన వరి పంటలో కాండం తొలుచు పురుగు గమనించామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలం పెద్దపల్లి రైతు సేవా కేంద్రాన్ని ఏడీఏ నాగరాజ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమోదు రిజిస్టర్‌లో సర్వే నెంబర్ వారీగా రైతు సాగు చేసిన పంటలు, రకం, విస్తీర్ణం, నీటి ఆధారం, ఆధార్ కార్డు నెంబర్, మొబైల్ నెంబర్, రైతు సంతకం ఉండాలన్నారు. వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఎకరాకు 8–10 అమర్చాలని పేర్కొన్నారు. ఫ్లూబెండమైడ్ పురుగు మందు ఎకరాకు 50 మిల్లీ లీటర్ల చొప్పున నీటికి కలిసి పిచికారీ చేయాలన్నారు. ఆకుముడత పురుగు ఆశిస్తే క్లోరోఫైరిఫాస్ మందు లీటరు నీటికి 2 మిల్లీ లీటర్ల చొప్పున పిచికారీ చేయాలన్నారు. పొటాష్ ఎరువును పొట్ట దశలో ఎకరాకు 20–25 కిలోలు తప్పనిసరిగా వేయాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో జిలకర మసూర రకానికి దోమ పోటు ఆశించే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమ సందీప్, సందీప్‌సింహయాదవ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు బకాయిలపై ప్రత్యేక దృష్టి


డివిజన్ అధికారుల సమీక్ష సమావేశంలో ఎస్ఈ రమణ

రాజంపేట రూరల్ : విద్యుత్తు బకాయిల వసూళ్లలో రాజీపడద్దని, దయచూపించే స్థితిలో ఏపీఎస్పీడీసీఎల్ లేదని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఎస్‌సి.రమణ అన్నారు. బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి.. కట్టని వారి విద్యుత్తు కనెక్షన్లు తొలగించాలన్నారు. సిద్దవటం, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, పెనగలూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, రైల్వేకోడూరు మండలాల అధికారులతో స్థానిక డివిజన్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ముందుగా ఈఈ ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రగతి నివేదిక వినిపించారు. రమణ మాట్లాడుతూ పనిచేసే చోట నివాసముంటే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. కేటాయించిన ప్రాంతాల్లో నివాసం లేని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒక్క యూనిట్ కూడా వృథాకారాదని, లైన్ల వెంబడి పరిశీలించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వాలిన స్తంభాలు, లూజ్ లైన్లను యుద్ధప్రాతిపదకన సరిచేయాలన్నారు. పనితీరు మెరుగుపరుచుకోకపోతే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో డీఈఈ, ఏఈ, జెఈలు, అధికారులు పాల్గొన్నారు.

దేవి శాంభవి. దీన బాంధవి

శరన్నవరాత్రులలో భాగంగా జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో శనివారం దేవి శాంభవి.. దీన బాంధవి అని ఆరాధిస్తూ ప్రత్యేక పుష్పాలు, ఆభరణాలు, పట్టువస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. అన్నపూర్ణగా, గజలక్ష్మీదేవిగా, విజయదుర్గగా, శారదాదేవిగా అర్చకులు అలంకరించిన అమ్మవార్లను భక్తులు దర్శించు కున్నారు. ఆలయ నిర్వాహకులు, ధర్మకర్తలు ఉదయం నుంచి అభిషేకాలు, చండీపారాయణం, సహస్ర నామార్చన, దేవీ ఖడ్గమాల వంటి పూజలు చేశారు. పుష్పాలు, విద్యుద్దీపాలంకరణలో ఆలయాలు కళకళలాడాయి.


సిద్దవటం: బంగారుపేటలో బాలా త్రిపుర సుందరీ దేవిగా గంగాభవానీ


నందలూరు: గజలక్ష్మీదేవి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి


ఒంటిమిట్ట: అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న వాసవీ కన్యకాపరమేశ్వరి



చిన్నమండెం: శారదా దేవిగా దర్శనమిస్తున్న కన్యకా పరమేశ్వరి


గాలివీడు: పూజారివాండ్లపల్లెలోని ఇరుగులమ్మ తల్లి


రాయచోటి: అన్నపూర్ణేశ్వరిగా దర్శనమిస్తున్న భద్రకాళీ అమ్మవారు


రైల్వేకోడూరు అర్బన్: అన్నపూర్ణ అలంకరణలో కన్యకాపరమేశ్వరి


పెనగలూరు: శివాలయంలో అన్నపూర్ణాదేవిగా కామాక్షి అమ్మవారు


పెనగలూరు: వినాయక నగర్ విజయదుర్గ ఆలయంలో అమ్మవారు